
సాక్షి
అనంతపురం
మంగళవారం ‌। 10 ‌। సెప్టెంబర్ ‌। 2024



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



జిల్లాకు ఎరువులు

ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా 750 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు వచ్చినట్లు ఏడీఏ ఎం.రవి తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.2°/24.4°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

జీబీసీ మెయిన్ కెనాల్‌కు కోత



అండర్ బ్రిడ్జి సైడ్ వాల్ పడిపోయి కోతకు గురైన జీబీసీ గట్టు

విడపనకల్లు: మండల సమీపంలో గుంతకల్లు బ్రాంచి మెయిన్ కెనాల్ (జీబీసీ) గట్టు కోతకు గురైంది. గతంలో ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ జీబీసీ ఆధునికీకరణ పనులు చేపట్టింది. రూ. వందల కోట్ల టెండర్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టు సంస్థ.. మెయిన్ కెనాల్ గుండా ఉన్న అండర్ బ్రిడ్జిలను మాత్రం ఆధునికీకరించలేదు. బ్రిడ్జిల వద్ద ఉండే సైడ్ వాల్స్ శిథిలమైనా పట్టించుకోలేదు. ఈ క్రమంలో అవి పూర్తిగా దెబ్బతిని నీటి ప్రవాహానికి పడిపోతున్నాయి. తాజాగా సోమవారం నాల్గో కిలోమీటర్ వద్ద ఉన్న బ్రిడ్జి సమీపంలో సైడ్ వాల్ కూలింది. దీంతో కెనాల్‌కు గండి పడే ప్రమాదం ఉందని గ్రహించిన అధికారులు నీటి ప్రవాహాన్ని నిలిపివేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

12న ఐఏబీ సమావేశం

అనంతపురం సెంట్రల్: కలెక్టరేట్‌లో ఈ నెల 12న సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించనున్నట్లు హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల ప్రజాప్రతినిధుల హాజరవుతారని పేర్కొన్నారు. ఈ ఏడాది తుంగభద్ర జలాశయం నుంచి 26.368 టీఎంసీలు కేటాయించారన్నారు. ఇందులో తాగునీటికి 10 టీఎంసీలు, 16.368 టీఎంసీలు సాగునీటికి కేటాయించాల్సి వస్తోందన్నారు. లక్ష ఎకరాల్లో ఆరు తడి పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఐఏబీ సమావేశంలో ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు తీసుకుంటామన్నారు. చివరి ఆయకట్టుకూ నీరు అందించాలని లక్ష్యం విధించుకున్నట్లు తెలిపారు. ఎక్కువ రోజులు నీటిని అందించడానికి ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతి అమలు, నీటి నిర్వహణకు రెవెన్యూ, పోలీసు, ఇంజినీరింగ్ అధికారులతో కమిటీలు, నాలుగు నెలలు తాత్కాలిక లస్కర్ల ఏర్పాటు, 16 అద్దె వాహనాలు తదితర అంశాలను ఐఏబీ అజెండాలో పొందుపర్చినట్లు వివరించారు.

పూర్ణాహుతితో చవితి వేడుకలకు ముగింపు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మూడు రోజులుగా సాగిన వినాయక చవితి వేడుకలు సోమవారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం గణపతి మూలమంత్ర పూజ, అథర్వశీర్ష గణపతి ఉపనిషత్ హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వర రెడ్డి రూ.13,500కు లడ్డూ దక్కించుకున్నారు. సాయంత్రం స్వామివిగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి కసాపురం సమీపంలోని హంద్రీనీవా కాలువలో నిమజ్జనం చేశారు.

కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఆ కీలక నేత ‘పుత్ర’రత్నం అక్రమార్జనకు దిగిపోయాడు. అప్పటి వరకూ రాజకీయాలతో అంటీముట్టనట్లు మెలిగిన ఆయన.. ‘ఎర్ర’మట్టి కొల్లగొట్టేందుకు రంగంలోకి దిగాడు. టిప్పర్ డ్రైవర్లకు అభయమిచ్చి మరీ ప్రత్యక్ష దోపిడీకి ‘సిద్ధ’మైపోయాడు. కొన్ని రోజులుగా నిత్యం రూ. లక్షల్లోనే జేబులు నింపుకుంటున్నాడు. కీలక నేత కుమారుడు కావడంతో అధికారులు అటువైపు చూడడం లేదు.



పెద్దకొండ వద్ద ఇటాచీ ద్వారా టిప్పరులో ఎర్రమట్టి నింపుతున్న దృశ్యం

పుత్రరత్నం.. దోపిడీపర్వం

- కూటమి ప్రభుత్వం రాగానే ‘సిద్ధ’హస్తుడైపోయిన వైనం
- అనంతపురం రూరల్ మండలం కృష్ణమరెడ్డిపల్లి సమీపంలో ఎర్రమట్టి అక్రమ రవాణా
- రోజూ సగటున 60 టిప్పర్ల తరలింపు
- లోడుకు రూ. 3 వేల చొప్పున నిత్యం ఆయన జేబులోకి రూ. 1.50 లక్షలు
- ప్రభుత్వ ఆదాయానికీ గండి
- అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలకు ప్రత్యేక అనుమతులు
- ఎవరైనా వాహనాలను పట్టుకుంటే తన పేరు చెప్పాలంటూ అభయం

అనంతపురం టాస్క్‌ఫోర్స్: అనంతపురం రూరల్ మండలం కృష్ణమరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని 231 సర్వే నంబరులో (చియ్యేడు పొలం) పెద్దకొండ ఉంది. ఈ కొండంతా ఎర్రమట్టే ఉంటుంది. 2014–19 వరకు కొందరు టీడీపీ నాయకులు కొండ నుంచి ఎర్రమట్టిని తరలించి లక్షల రూపాయలు సంపాదించుకున్నారు. మళ్లీ ఇటీవల కూటమి ప్రభుత్వం రాగానే స్థానికంగా ఉన్న టీడీపీ చోటా నాయకులు పెద్దకొండపై కన్నేశారు. ఇటాచీ, జేసీబీలు పెట్టి ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టి.. ఒక టిప్పర్ లోడుకు రూ. 1,000 ప్రకారం వసూలు చేశారు. రోజూ 50 ట్రిప్పుల దాకా అక్రమంగా లోడింగ్ చేసి ‘క్యాష్’ చేసుకున్నారు. అయితే, వాటాల విషయంలో విభేదాలు తలెత్తాయి. అది కాస్తా ‘పెద్దింటి’ వరకూ వెళ్లింది. అంతే.. కీలక నేత కుమారుడు రంగంలోకి దిగాడు.

క్యాష్ కొట్టాల్సిందే..

రెండు వారాల క్రితం సదరు యువ నేత పెద్దకొండ వద్దకు చేరుకున్నాడు. ఎర్రమట్టి తవ్వకాల్లో ఎవరూ జోక్యం చేసుకోవద్దంటూ స్థానిక నాయకులకు గట్టి వార్నింగ్ ఇచ్చాడు. ఆయనే స్వయంగా భూమి పూజ చేసి ఇటాచి, జేసీబీ వాహనాలను పెట్టాడు. ఆయనకు సంబంధించిన ఓ వ్యక్తిని అక్కడ ఉంచాడు. ఏ పార్టీ వారైనా కావొచ్చు.. టిప్పరుకు రూ. 3 వేలు చెల్లించి లోడు చేసుకోవచ్చని తెగేసి చెప్పాడు. అదికూడా నగదు ఇవ్వాల్సిందే. నో ఆన్‌లైన్ పేమెంట్ అంటూ షరతు పెట్టాడు.

జేబులోకి రోజూ రూ. లక్షలు...

ఇక్కడ రోజూ సుమారు 60 టిప్పర్ల మట్టి లోడింగ్ జరుగుతోంది. ఈ క్రమంలో నిత్యం రూ. 1.80 లక్షల దాకా ఆ నేతకు చేరుతోంది. ఇందులో ఇటాచి, జేసీబీ బాడుగ, ఒక మనిషి కూలి పోను రమారమి రూ. 1.50 లక్షలు అప్పనంగా జేబులోకి వేసుకుంటున్నాడు. ఈ యువ నేత వ్యవహారంపై స్థానిక టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. పార్టీ కోసం పని చేసిన తాము పది రూపాయలు సంపాదించుకుందామంటే వాళ్లే అన్నిట్లోనూ జోక్యం చేసుకుంటున్నారంటూ వాపోతున్నారు.



జగనన్న కాలనీకి కేటాయించిన భూమిలో మట్టిని తరలించడంతో ఏర్పడిన గుంత

పట్టుకుంటే నా పేరు చెప్పండంటూ..

ఎర్రమట్టి తరలింపు అంతా జీరో వ్యాపారమే. ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించరు. రోజూ వేలాది రూపాయల పన్ను ఎగ్గొడుతున్నారు. టిప్పర్ యజమానులకు సదరు నేత బంఫర్ ఆఫర్ ఇచ్చాడు. లోడ్ చేసుకున్న తర్వాత జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడైనా అన్‌లోడ్ చేసే సమయంలో పోలీసులు, ఇతర శాఖల అధికారులెవరైనా పట్టుకుంటే అంతా తానే చూసుకుంటానని హామీ ఇచ్చాడు. ఎవరైనా బండి ఆపితే వెంటనే తనకు ఫోన్ చేయాలని టిప్పర్ల యజమానులకు అభయమిచ్చినట్లు తెలిసింది.

జగనన్న కాలనీని చెరబెట్టారు..

పెద్దకొండ పక్కనే 90/3 సర్వే నంబరులోని జగనన్న కాలనీని కూడా ఎర్రమట్టి దొంగలు చెరబెట్టారు. ఎర్రమట్టి కోసం పెద్దపెద్ద గుంతలు తవ్వారు. వాటిని పూడ్చాలంటే ఒక్కొక్కరు వేలాది రూపాయలు ఖర్చు చేసుకోవాల్సి ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

కరిగిపోతున్న పెద్దకొండ

అక్రమార్కుల పుణ్యమా అని పెద్ద కొండ కాస్తా రోజురోజుకూ చిన్నకొండగా మారుతోంది. ఒకప్పుడు మేత కోసమని మేకలు, గొర్రెలతో పాటు ఆవులు, గేదెలు పెద్దకొండ పైకి వెళ్లేవి. ఎర్రమట్టి దొంగల ఆగడాలతో నేడు కొండ చుట్టూ పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీంతో జీవాలు కొండపైకి వెళ్లలేని పరిస్థితి. కాగా, ఎర్రమట్టి అక్రమ రవాణాపై వివరణ కోరేందుకు గనుల శాఖ డీడీ నాగయ్యకు పలుమార్లు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

ఉచిత పంటల బీమా కొనసాగింపు

- వచ్చే రబీ నుంచి రైతుల నుంచి ప్రీమియం వసూలు



అనంతపురం అగ్రికల్చర్: ఉచిత పంటల బీమా పథకాన్ని ఈ ఖరీఫ్ వరకూ కొనసాగిస్తూ కూటమి సర్కారు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చే రబీ నుంచి రైతుల నుంచి ప్రీమియం వసూలు చేయనున్నారు. ఈ–క్రాప్ ఆధారంగా మండలం యూనిట్‌గా వాతావరణ ఆధారిత బీమా పథకం అమలవుతుందని పేర్కొన్నారు. మరిన్ని పంటలకు దిగుబడి ఆధారంగా బీమా వర్తింపజేశారు.

- ప్రస్తుత ఖరీఫ్‌లో వాతావరణ బీమా పథకం వేరుశనగ, పత్తి, అరటి, టమాట, చీనీ, దానిమ్మ పంటలకు వర్తిస్తుంది. రబీలో టమాటకు మాత్రమే వర్తిస్తుంది. శ్రీ సత్యసాయి జిల్లాలో అరటి మినహా మిగతా పంటలకు బీమా ఇచ్చారు. వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమశాతం, పంటల సాగు విస్తీర్ణం, ఆటోమేటిక్ వెదర్‌బేస్డ్ స్టేషన్ డేటా ప్రకారం వేరుశనగ హెక్టారుకు రూ.80 వేల బీమా నిర్ణయించారు. పత్తి హెక్టారుకు రూ.95 వేలు, దానిమ్మకు రూ.1,87,500, అరటికి రూ.1.50 లక్షలు, చీనీకి రూ.1,37,500, టమాటకు రూ.80 వేల ప్రకారం బీమా ఖరారు చేశారు.
- ప్రధాన మంత్రి ఫసల్‌బీమా పథకం కింద పంట దిగుబడి ఆధారంగా మరికొన్ని పంటలకు బీమా వర్తింపజేశారు. జిల్లాలో గ్రామం యూనిట్‌గా కంది పంటను చేర్చారు. మండలం యూనిట్‌గా వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండు మిరప పంటలను చేర్చారు. రబీలో పప్పుశనగ, వేరుశనగ, వరి, జొన్న, మొక్కజొన్న పంటలకు బీమా వర్తింపజేశారు.
- శ్రీ సత్యసాయి జిల్లాలో ఫసల్‌బీమా కింద గ్రామం యూనిట్‌గా కందిని చేర్చారు. ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, ఆముదం, రాగి పంటలకు వర్తింపజేశారు. రబీలో వేరుశనగ, వరికి బీమా వర్తింపజేశారు.

గడువుకు ముందే అర్జీలు పరిష్కరించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్
- ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’కు 315 వినతులు

అనంతపురం అర్బన్: సమస్యలపై ప్రజలు నుంచి అందే అర్జీలను గడువుకు ముందే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు శిరీష, కరుణకుమారి, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 315 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకూడదని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని..

- తాడిపత్రి మండలం ఎరుకల కాలనీ, గన్నేవారి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగంలో చేరారని తాతగారిపల్లికి చెందిన అశ్వర్థనాయుడు ఫిర్యాదు చేశారు. ఐసీడీఎస్ అధికారి విచారించి, వాస్తవమని నిర్ధారించినా చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని, తగిన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
- తమ భూమిని వేరొకరి పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేశారని వజ్రకరూరు మండలం వెంకటాంపల్లికి చెందిన వడ్డే పెద్దన్న ఫిర్యాదు చేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సర్వే నంబరు 187–2సీలో తమకు 4.02 ఎకరాల భూమి ఉందన్నారు. బ్యాంకులో పంట రుణం కూడా తీసుకున్నామన్నారు. అయితే తమ భూమిని వేరొకరి పేరున 1బీ, అడంగల్‌లో నమోదు చేశారని వాపోయారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

- ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించాలని తాడిపత్రి మండలం ఇగురూరుకు చెందిన ధనలక్ష్మి విన్నవించారు. తండ్రి లక్ష్మన్న అనారోగ్యంతో మరణించారని, గత ఏడాది ఫిబ్రవరి 11న తల్లి సావిత్రి కూడా రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తనకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

బాధ్యతలు విస్మరిస్తే సహించను

‘విధులను నిర్లక్ష్యం చేసినా, అప్పగించిన బాధ్యతలను విస్మరించినా సహించే ప్రసక్తి ఉండదు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయి’ అంటూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి 182 మందిని కేటాయిస్తే, కొందరు ఇప్పటికీ వెళ్లకపోవడం ఏమిటంటూ అసహనం వ్యక్తం చేశారు. అందరూ తక్షణమే వెళ్లాలని ఆదేశించారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియను ఆయా శాఖల పరిధిలో ఈనెల 13లోగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి గురువారం ఉదయం 7.45 నుంచి ఉదయం 8.15 వరకు ఆల్ ఇండియా రేడియోలో కార్యక్రమం ఉంటుందని, ఈ వారం ‘కౌలు రైతులకు కార్డుల’ అంశం తీసుకున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నగర్ వన్ యోజన కింద పట్టణ స్థానిక సంస్థలకు రూ.2 కోట్ల వరకు నిధులు ఇవ్వనుందని, పట్టణ ప్రాంతం నుంచి 10 కిలోమీటర్లలోపు భూమి గుర్తించాలని ఆదేశించారు.

- కారుణ్య నియామకాలు, ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియ 15 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ కలెక్టరేట్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టాలని చెప్పారు.
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి సూచనలందించారు. కేటాయించిన లక్ష్యాల మేరకు కూలీలకు ఉపాధి హామీ పనులు పనులు కల్పించాలని ఆదేశించారు. పనులు కల్పించలేదనే ఫిర్యాదులు రాకూడదన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- పెళ్లైన నాలుగు నెలలకే ఘోరం

గుమ్మఘట్ట/రాయదుర్గం: గుమ్మఘట్ట మండలంలోని పూలకుంటకు చెందిన వివాహిత నందిని (19) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం గోనబావికి చెందిన వడ్డే రామాంజనేయులు, నాగమ్మ దంపతుల కుమార్తె నందినికి నాలుగు నెలల క్రితం పూలకుంటకు చెందిన సుంకన్న, పద్మక్క దంపతుల కుమారుడు నగేష్‌తో వివాహమైంది. కొన్ని వారాల పాటు వీరి కాపురం సవ్యంగా సాగినా... ఆ తర్వాత అత్తింటి వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో నందిని రెండు నెలల క్రితం పుట్టింటికి చేరుకుంది. ఈ నేపథ్యంలో పెద్దలు పంచాయితీ నిర్వహించి రాజీ చేయడంతో వారం రోజుల క్రితం ఆమెను అత్తింటికి తల్లిదండ్రులు పంపారు. సోమవారం ఉదయం అపస్మారక స్థితిలో ఉన్న నందినిని భర్త నగేష్ తన ద్విచక్ర వాహనంపై రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు.

బాత్‌రూమ్‌లో పడిందంటూ..

తన కుమార్తెను అత్తారింటికి పంపితే చంపేస్తారని పెద్దల సమక్షంలో తాను ముందే చెప్పినట్టు నందిని మృతదేహాన్ని చూసి తండ్రి రామాంజనేయులు బోరున విలపించాడు. మీడియా ముందు ఆయన మాట్లాడుతూ.. ‘వారు మనుషుల్లా ప్రవర్తించలేదు. పది రోజులుగా అత్తింట్లో వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. బాత్‌రూమ్‌లోకి వెళుతుంటే కాలుజారి



ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) నందిని (ఫైల్)

కిందపడిందని చెబుతున్నారు. ఈ విషయం కూడా మాకు ఆలస్యంగా తెలిపారు. చంపేసి నాటకాలు ఆడుతున్నారు’ అంటూ వాపోయాడు. తన కుమార్తె మృతికి భర్త, అత్తనే కారణమని ఆరోపించాడు.

మేము కారకులం కాదు

మృతురాలి తండ్రి, బంధువులు ఆరోపిస్తున్నట్టు నందినిని తాము హత్య చేయలేదని, కాలుజారి పడడంతోనే ఆమె మృతి చెందిందని భర్త నగేష్, అంతింటి వారు పోలీసులకు వివరించారు. కాగా మృతురాలి నోట్లో పురుగుల మందు ద్రావకం కనిపించడం, దుర్వాసన వెదజల్లడంతో మృతిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో నందిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, తమ కుమార్తె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలంటూ తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. రూరల్ సీఐ వెంకటరమణ రంగంలోకి దిగి వారికి సర్దిచెప్పడంతో ఆందోళనను విరమించారు.

గణేష్ నిమజ్జనోత్సవానికి పటిష్ట చర్యలు

- జిల్లా ఎస్పీ పి. జగదీష్

అనంతపురం: నగరంలో నిర్వహించే గణేష్ నిమజ్జనోత్సవానికి పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. ఈ నెల 11న నిర్వహించే నిమజ్జనోత్సవం విజయవంతం కావడానికి అందరూ సహకరించాలని కోరారు. సోమవారం ఆయన పంపనూరు సమీపంలోని వినాయక నిమజ్జన ప్రాంతాన్ని (హెచ్ఎస్ఎస్ఎస్ కాలువ) సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ, ఎస్ఐలకు పలు సూచనలు చేశారు. నిమజ్జన ప్రాంతాల్లో వృద్ధులు, పిల్లలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆ ప్రాంతంలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఆ రహదారి గుండా వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. బందోబస్తు నిమిత్తం 500 మంది పోలీసు సిబ్బందిని కేటాయించామన్నారు. పోలీసులకు సహకరిస్తూ ఉత్సవాలను ఘనంగా, ఆహ్లాదకర వాతావరణంలో



గణేష్ నిమజ్జనాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ జగదీష్

నిర్వహించుకోవాలని గణేష్ ఉత్సవ కమిటీలు, విగ్రహ మంటపాల నిర్వాహకులకు ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఊరేగింపు రూట్ మ్యాప్ ఇలా..

అనంతపురంలో ఈ నెల 11న విగ్రహాల ఊరేగింపునకు సంబంధించి పోలీసులు రూట్ మ్యాప్ విడుదల చేశారు.

- మధ్యాహ్నం 3 గంటలకు గణేష్ విగ్రహాల ఊరేగింపు ప్రారంభించాల్సి ఉంటుంది.
- 10 అడుగుల కంటే ఎత్తైన విగ్రహాలు పంపనూరు కెనాల్ వద్ద నిమజ్జనం చేయాలి. సప్తగిరి సర్కిల్– రాజీవ్ రోడ్డు– శ్రీకంఠం సర్కిల్– తిలక్ రోడ్డు– తాడిపత్రి బస్టాండు– గాంధీ బజార్– బసవన్న కట్ట– సూర్యనగర్ సర్కిల్– సప్తగిరి సర్కిల్– టవర్‌క్లాక్– పీటీసీ– నడిమి వంక– కళ్యాణదుర్గం బైపాస్ మీదుగా వెళ్లాలి.
- 10 అడుగుల కంటే తక్కువ ఎత్తు విగ్రహాలు రాచానపల్లి వంక వద్ద నిమజ్జనం చేయాలి. బళ్లారి బైపాస్ మీదుగా వెళ్లాలి.
- ఎత్తైన విగ్రహాలను తపోవనం సర్కిల్ మీదుగా సర్వీసు రోడ్డు ద్వారా కళ్యాణదుర్గం రోడ్డుకు తీసుకెళ్లాలి.

ట్రాఫిక్ మళ్లింపు..

ఈ నెల 11న ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నారు. అందులో భాగంగా కార్లు, లారీలు, ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, ఇతర భారీ వాహనాలు తపోవనం సర్కిల్, రవి పెట్రోల్ బంక్, రాజహంస అపార్ట్‌మెంట్ (సాక్షి ఆఫీసు), పంగల్ రోడ్డు, కలెక్టరేట్, భాస్కర్ పెట్రోల్ బంక్, మేడా పెట్రోల్ బంక్, మిర్చియార్డు, తడకలేరు మీదుగా ప్రయాణించకుండా నిషేధం విధించారు.



గుంతకల్లు పట్టణంలో వినాయక ప్రతిమల శోభాయాత్ర



తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామంలో..



గుంతకల్లులో యువత ఉత్సాహం

గంగ ఒడికి గణపయ్య

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వాడవాడలా కొలువుదీరిన బొజ్జ గణపయ్యలు సోమవారం పలు చోట్ల గంగమ్మ చెంతకు చేరుకున్నారు. ఈ సందర్భంగా విగ్రహాల శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో సాగింది. యువతలో ఉత్సాహం అంబరమంటింది. డ్యాన్సులు చేస్తూ, ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై అంటూ భక్తులు వీడ్కోలు పలికారు. – సాక్షి నెట్‌వర్క్



గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌లో విగ్రహాల నిమజ్జనం

క్లుప్తంగా

కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులను రెగ్యులరైజ్ చేయండి



ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలంటూ స్టాఫ్ నర్సులు సోమవారం సర్వజనాస్పత్రి ఆవరణలో ధర్నా చేపట్టారు. కూటమి సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 115తో తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటి ఆస్పత్రిలో మొత్తం 296 మంది కాంట్రాక్ట్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. డీఎస్సీ, రోస్టర్ పాయింట్ల ద్వారా తమను ఎంపిక చేశారన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందించామన్నారు. చాలీచాలని వేతనాలతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న తమపై చిన్నచూపు చూడడం తగదన్నారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సు అసోసియేషన్ నాయకులు శ్రీదేవి, మానస, లక్ష్మీప్రసన్న, నీలిమా, శ్రీలక్ష్మి, నారాయణమ్మ, కీర్తి, ఫక్రున్నీసా, శ్రీవిద్య, ప్రవీణ, సురేష్, పాల్గొన్నారు.

కదిరి ఆర్డీఓగా శ్రీనివాసులు

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూశాఖలో ఏఓలుగా పనిచేస్తున్న 13 మందికి ఆర్డీఓలుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో అనంతపురం ఏఓ శ్రీనివాసులు కదిరి ఆర్డీఓగా నియమితులయ్యారు. హిందూపురం ఏఓ జాన్‌పాల్‌ను శ్రీకాకుళం జిల్లా ఆర్డీఓగా బదిలీ చేశారు.



భారత్ టీం-ఏ నూతన కెప్టెన్ మయాంక్ అగర్వాల్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం





అనంతపురానికి చేరుకున్న క్రికెటర్లు



స్టార్ క్రికెటర్ శివమ్ దూబేకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఘన స్వాగతం

అనంతపురం: దులీప్‌ట్రోఫీలో భాగంగా అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో జరుగుతున్న మ్యాచుల్లో పాల్గొనేందుకు భారత్-ఏ, భారత్-బీ జట్ల క్రీడాకారులు సోమవారం అనంతపురం చేరుకున్నారు. రియాన్ పరాగ్, రింకూ సింగ్, శివమ్ దూబే, ఖలీల్ అహమ్మద్, మయాంక్ అగర్వాల్, తిలక్ వర్మతో పాటు ఆంధ్రా స్టార్ నితీష్ కుమార్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. కాగా, భారత్ టీం-ఏకు కెప్టెన్‌గా ఉన్న శుభమన్ గిల్ బంగ్లాదేశ్‌తో జరిగే టెస్ట్ మ్యాచ్‌కు ఎంపిక కావడంతో మయాంక్ అగర్వాల్‌ను కెప్టెన్‌గా నియమించారు. ఇక.. భారత్ టీం-డీలో అక్షర్ పటేల్ స్థానంలో నిషాంత్‌ను, తుషార్ దేశ్ పాండే స్థానంలో కావేరప్పను జట్టులోకి తీసుకున్నారు.



రియాన్ పరాగ్‌కు స్వాగతం



ప్రసిద్ధ్ కృష్ణను స్వాగతిస్తున్న దృశ్యం



రింకూ సింగ్, తదితరులు



వాషింగ్టన్ సుందర్



ముషీర్‌ఖాన్, సాయికిషోర్, సర్ఫరాజ్ ఖాన్

ఎస్‌ఆర్‌ఐటీ ప్రొఫెసర్‌కు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ నగేష్

బుక్కరాయసముద్రం: పాన్ ఇండియా ఐకాన్ ఉపాధ్యాయ అవార్డును బీకేఎస్ మండలం రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్)లో సీఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ నగేష్ అందుకున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ ఆదివారం వెల్లడించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో బోధిస్తున్న టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లకు ఏటా ఈ అవార్డును అందించడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాదికి గాను ఈ నెల 8న గుంటూరులోని కెన్నడి నెక్స్ జనరేషన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో అవార్డుల ప్రదానోత్సవంలో నగేష్‌కు ఈ అవార్డును ఎమ్మెల్సీ లక్ష్మణరావు అందజేశారు. తనకు దక్కిన ఈ అవార్డును ఎస్ఆర్ఐటీకు అంకితం చేస్తున్నట్లు నగేష్ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అనంతపురం మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సోమవారం సీఐ శాంతిలాల్ వెల్లడించారు. కూడేరు మండలం చోళసముద్రం గ్రామానికి చెందిన బి. శంకరయ్య కుమారుడు బద్దిపూటి శ్రీధర్, గుండారపు రామచంద్రప్ప కుమారుడు నాగరాజు సోమవారం ఉదయం బళ్లారి బైపాస్ రోడ్డులోని ఎంజీ పెట్రోల్ బంక్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతుంటే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో వారి వద్ద 4.4 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులను అరెస్ట్ చేసి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.30,500 నగదు, ఒక టాటా జెస్ట్ కారు , ఒక బంగారు చైను, రెండు ఉంగరాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా శ్రీధర్... అనంతపురం పాతూరులోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో టెంకాయల మండి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. సంపాదన తన జల్సాలకు సరిపోవడం లేదని భావించిన ఆయన సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి వ్యాపారం మొదలు పెట్టాడు. అమలాపురం, రాజమండ్రి, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి లారీల్లో టెంకాయిలు తెప్పించే క్రమంలో రాజమండ్రిలో ప్రసాద్ అనే కారు డ్రైవర్‌తో పరిచయం పెంచుకుని అక్కడి నుంచి టెంకాయల మధ్యలో పెద్ద మొత్తంలో గంజాయిని అనంతపురానికి దిగుమతి చేసుకునేవాడు. అనంతరం తన సంత గ్రామానికి చెందిన, వరుసకు అన్న అయిన గుండారపు నాగరాజుతో కలసి గంజాయిని చిన్న, చిన్న ప్యాకెట్లుగా మార్చి అనంతపురంలోనే విక్రయాలు మొదలు పెట్టాడు. ఆదివారం తన కారులో గంజాయిని ఉంచుకుని విక్రయిస్తుండగా పోలీసులు గుర్తించి శ్రీధర్‌తో పాటు నాగరాజును అరెస్ట్ చేశారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

అనంతపురం: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. అనంతపురంలోని పాతూరు చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడిని శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లికి చెందిన గోగుల నారాయణ (75)గా పోలీసులు గుర్తించారు. సోమవారం రాత్రి చెన్నకేశవస్వామి ఆలయం వద్ద నడుచుకుంటూ వెళుతున్న ఆయనను ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నారాయణను స్థానికులు సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మద్యం అనుకుని పురుగుల మందు తాగి...

యాడికి: ప్రమాదవశాత్తు మద్యం అనుకుని పురుగుల మందు తాగి ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... యాడికి మండలం రాయలచెరువుకు చెందిన అశోక్ (23) బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన అశోక్ సోమవారం మధ్యాహ్నం ఫుల్‌గా తాగి మత్తులో జోగుతూ మరింత మద్యం అనుకుని పురుగుల మందు తాగి లయన్స్ క్లబ్ కార్యాలయం ఎదుట రోడ్డుపై పడిపోయాడు. విషయం తెలుసుకున్న అశోక్ అన్న లోకేష్ అక్కడకు చేరుకుని వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక రాత్రి 7 గంటల సమయంలో అశోక్ మృతి చెందాడు. కాగా, ఘటనపై పోలీసులు మాట్లాడుతూ.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



మృతుడు అశోక్

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

- కార్మిక, రైతు సంఘాల నాయకుల డిమాండ్
- నేడు జిల్లావ్యాప్తంగా రాస్తారోకోలు



విలేకరులతో మాట్లాడుతున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కార్మిక, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో మంగళవారం జిల్లావ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్ మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అడ్డదారిలో ప్రైవేటీకరణ చేసేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. నరేంద్ర మోదీ ప్రధానిగా మూడో సారి అధికారం చేపట్టిన తర్వాత ఉక్కు పరిశ్రమ పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పథకం ప్రకారం ఉత్పత్తి సామర్థ్యం తగ్గించి మరింత నష్టాల్లోకి నెట్టివేస్తున్నారన్నారు. తద్వారా కార్పొరేట్ కంపెనీలకు పరిశ్రమను కట్టబెట్టే కుట్ర సాగుతోందని తెలిపారు. ఇదే జరిగితే వేలాదిగా కార్మికులు రోడ్డు పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించడంతో పాటు స్టీల్ అథారటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నాయకులు కృష్ణుడు, చిరంజీవి, వన్నారెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విస్మరిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు

- కూటమి సర్కార్‌కు సీఐటీయూ నాయకుల హెచ్చరిక
- నీటి ప్రాజెక్టుల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో



కలెక్టరేట్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న కార్మికులు

అనంతపురం అర్బన్: కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదని, ఇది చరిత్ర చెప్పిన సత్యమని సీఐటీయూ నాయకులు అన్నారు. తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులను విస్మరించినందు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కూటమి సర్కార్‌ను హెచ్చరించారు. శ్రీరామరెడ్డి, సత్యసాయి నీటి ప్రాజెక్టుల కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ అనంతపురంలోని టవర్ క్లాక్ నుంచి కలెక్టరేట్ వరకూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్‌ను వ్యక్తిగతంగా కలిసి వినతి పత్రం ఇస్తామన్న కార్మికుల వినతిని పోలీసులు తిరస్కరించడంతో కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. రహదారిపై ట్రాఫిక్ స్తంభించడంతో కార్మికులందరినీ కలెక్టరేట్‌లోనికి అనుమతించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నీటి ప్రాజెక్టుల కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు ఓబుళు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడారు. తాగునీటి పథకాల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనం ఇవ్వకపోతే కుటుంబాలను పోషించుకుంటారని ప్రశ్నించారు. తక్షణం ఎనిమిది నెలల బకాయి వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసెస్మెంట్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కాంట్రాక్టు విధానం రద్దు చేసి కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. అనంతరం కలెక్టర్‌ను కార్మికుల వ్యక్తిగతంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నీటి ప్రాజెక్టుల సంఘాల అధ్యక్షులు ఈశ్వరయ్య, ఎర్రిస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు శ్రీరాములు, తిప్పేస్వామి, రామాంజనేయులు, వనూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధ అనుసంధానంతో సత్వర సేవలు

- మేయర్ వసీం



సదస్సులో వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: కృత్రిమ మేధను ఉపయోగించి సత్వర సేవలను అందించవచ్చునని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారని అనంతపురం నగర మేయర్ వసీం అన్నారు. రష్యాలోని ఖజాన్‌లో సోమవారం డిజిటల్ వీక్ -2024 సదస్సుకు 48 దేశాలకు చెందిన ప్రతినిధులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. అనంతపురం నుంచి మేయర్ వసీం వర్చువల్ విధానంలో పాల్గొని, ఆంధ్రప్రదేశ్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృత్రిమ మేధా అనుసంధానంతో అమలైన పలు అంశాలను వివరించారు. డిజిటల్ ప్రక్రియ ద్వారా సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారులకు అప్పటి సీఎం వైఎస్ జగన్ చేరవేసిన తీరును వివరించారు. డిజిటల్ తరగతులు, వైఫై అనుసంధానం విద్యారంగంలో చోటు చేసుకున్న విప్లవాత్మక మార్పులను విశ్లేషించారు. డిజిటల్ సేవలు పట్టణాలకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. భద్రతకు సంబంధించి పోలీసు శాఖ అమలు చేసే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా దొంగతనాలకు అడ్డుకట్ట వేసే విధానాన్ని మేయర్ వివరించారు.

అరుణాచల క్షేత్ర సందర్శనకు ప్రత్యేక బస్సు

ధర్మవరం అర్బన్: ఈ నెల 18న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ సందర్శనకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ధర్మవరం డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశారు. ఈ మేరకు డిపో మేనేజర్ సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న ధర్మవరం బస్టాండ్‌లో ఉదయం 6 గంటలకు బస్సు బయలుదేరి వెళుతుంది. రానుపోను ఛార్జీలు ఒకరికి రూ.1,400 చొప్పున వసూలు చేస్తారు. పూర్తి వివరాలకు 63031 51302, 99592 25859లో సంప్రదించవచ్చు.

హోరాహోరీగా యూటీఎఫ్ స్వర్ణోత్సవ క్రీడలు



బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ గేయానంద్

అనంతపురం ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయుల జిల్లా స్థాయి క్రీడాపోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో పోటీలను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ప్రారంభించి, మాట్లాడారు. ఒత్తిడి లేని బోధనను కొనసాగించేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఇండోర్ స్టేడియంలో జరిగిన బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగం విజేతగా వి. శివప్రసాదనాయుడు (పీఎస్ హెచ్ఎం ఊబిచెర్ల), వై రామాంజనేయులు (ఎస్జీటీ, చాపట్ల) నిలిచారు. రన్నరప్‌ను టి.వేణుగోపాల్ (పీడీ గుంతకల్లు), కె. నాగరాజు (పీడీ, ఉరవకొండ) దక్కించుకున్నారు. సింగిల్స్ విభాగంలో విజేతగా బి. సురేష్, రన్నరప్‌గా వై.లక్ష్మణ్ నిలిచారు. క్రికెట్‌లో విజేతగా రాయదుర్గం జట్టు, రన్నరప్‌ను అనంతపురం జట్టు, వాలీబాల్‌లో తొలి రెండు స్థానాలను ఉరవకొండ, రాయదుర్గం జట్లు కైవసం చేసుకున్నాయి. కాగా, ఈ నెల 14న ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ విభాగంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు ఉంటాయి. 22న త్రో బాల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్ పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, గౌరవాధ్యక్షులు రమణయ్య, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శులు రవికుమార్, సంజీవ్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, కొండప్ప, గంగాధర్, శ్రీనివాసులు, ఆదిశేషయ్య, నాగేంద్ర, రాజేంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి విద్యార్థినికి గాయాలు




చికిత్స పొందుతున్న విద్యార్థిని రూప

పెద్దవడుగూరు: ఇంటిపైగా వెళుతున్న విద్యుత్ తీగలు తగిలి ఓ విద్యార్థిని గాయపడింది. వివరాలు... పెద్దవడుగూరు మండలం చిత్రచేడు గ్రామానికి చెందిన కుమార్తె రూప 6వ తరగతి చదువుతోంది. గ్రామంలో వినాయక నిమజ్జనం కార్యక్రమం ఉండడంతో పాఠశాలకు సోమవారం సెలవు ప్రకటించారు. దీంతో రూప తమ ఇంటికి సమీపంలో ఉన్న స్నేహితులు గౌతమి, భార్గవితో కలసి వారి ఇంటి మిద్దెపై ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు పైభాగంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురైంది. గమనించిన స్నేహితులు వెంటనే కుటుంబ సభ్యులకు తెలపడంతో గాయపడిన రూపను పెద్దవడుగూరు పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. కాగా, ఇంటి పైభాగంలో వెళుతున్న విద్యుత్ తీగలు మార్చాలని పలు మార్లు ఆ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని గౌతమి, భార్గవి తండ్రి ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

ఖరీఫ్ పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

- శాస్త్రవేత్తలు విజయశంకరబాబు, నారాయణస్వామి



వేరుశనగ పంట

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల కురిసిన వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, ఆముదం, పత్తి, కంది, కొర్ర, సజ్జ తదితర పంటలకు చీడపీడలు, తెగుళ్ల ఆశించే అవకాశముందని, నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి సూచించారు. చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వారు వివరించారు.

- వేరుశనగలో కాండం కుళ్లు తెగులు నివారణకు మొక్కలు బాగా తడిచేలా ఎకరాకు 400 మి.లీ హెక్సాకొనజోల్ పిచికారీ చేయాలి.
- పత్తిలో గులాబీరంగు కాయ తొలచు పురుగు నివారణకు ఎకరాకు 10 చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి.
- కందిలో వెర్రితెగులు నివారణకు పంట కాలం 60 నుంచి 90 రోజుల సమయంలో ఎకరాకు నీటిలో కరిగే గంధకం 600 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. లేదంటే ఎకరాకు 400 మి.లీ ప్రొపార్‌గైట్ (ఓమైట్) పిచికారీ చేయాలి.
- ఆముదంలో నామాల పురుగు నివారణకు ఎకరాకు 200 మి.లీ నొవాల్యురాన్ లేదా 80 గ్రాములు ఎమామెక్టిన్ బెంజోయేట్ పిచికారీ చేయాలి.
- కొర్రలో అగ్గితెగులు నివారణకు లీటర్ నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ లేదా 0.6 గ్రాములు ట్రైసైక్లోజోల్ కలిపి పిచికారీ చేయాలి. అలాగే తుప్పు తెగులు నివారణకు లీటర్ నీటికి 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలచు పురుగు నివారణకు ఎకరాకు 8 కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలు వేయాలి. లేదంటే లీటర్ నీటికి 0.3 మి.లీ క్లోరాంట్రినిలిప్రోల్ కలిపి పిచికారీ చేయాలి.
- సజ్జలో తుప్పు తెగులు నివారణకు లీటర్ నీటికి 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి. అగ్గితెగులు నివారణకు 2 గ్రాముల లీటర్ నీటికి మాంకోజెబ్ లేదా 1 గ్రాము కార్బండిజమ్ కలిపి పిచికారీ చేయాలి.

క్లుప్తంగా

వరద బాధితులకు విరాళం



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న సప్తగిరి క్యాంపర్ వైస్ ప్రెసిడెంట్ హనీఫ్

అనంతపురం అర్బన్: విజయవాడ వరద బాధితుల కోసం సప్తగిరి క్యాంపర్ కంపెనీ ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను కలసిన సప్తగిరి క్యాంపర్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ హనీఫ్.. రూ.5 లక్షల విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా సామాజిక సేవలో భాగస్వాములవ్వాలన్నారు. హనీఫ్ మాట్లాడుతూ.. కంపెనీ డైరెక్టర్లు మహేష్‌రెడ్డి, శిల్పారెడ్డి సూచనల మేరకు వరద బాధితుల ఆర్థిక సహాయం అందించామన్నారు.

రామగిరి సీఐగా శ్రీధర్



చెన్నేకొత్తపల్లి: రామగిరి నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం సర్కిల్ సీఐగా పని చేస్తూ బదిలీపై రామగిరి సర్కిల్‌కు వచ్చారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న శివాంజనేయులు పుట్టపర్తి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో జూదం, మట్కా మద్యం అక్రమ రవాణా తదితర అసాంఘిక కార్యక్రమాలపై గట్టి నిఘా ఉంచుతామన్నారు. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

అన్నదానం



మాసుమాబీ దర్గా వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక పాతూరు మాసుమాబీ దర్గా వద్ద అన్నదానం ప్రారంభించారు. 12 రోజుల పాటూ పేదవారికి అన్నదాన, ఇతర సేవలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు కాలేషా, అయ్యవారి పల్లి మహ్మద్‌బాషా, నవాజ్, దాదా ఖలందర్, సయ్యద్ షా వలి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం రూరల్: బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శింగనమల నియోజకవర్గ అధ్యక్షుడిగా బోయ నరేష్, బుక్కరాయసముద్రం మండల అధ్యక్షుడిగా మోహన్, కార్యదర్శిగా మునీంద్రను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ.. బీసీల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, రాయలసీమ యువజన అధ్యక్షులు జశ్వంత్‌వ్యాస్, జిల్లా యువజన అధ్యక్షుడు చిత్రా నాగరాజు, నాయకులు విజయ్, ఇమామ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ, డీఎస్పీ

అనంతపురం: అన్ని మతాల సాంప్రదాయాలను పరస్పరం గౌరవించుకోవడం ద్వారా శాంతి ఫరిడవిల్లుతుందని ఆర్డీఓ వసంత్‌కుమార్, డీఎస్పీ టీ.వీ.వీ ప్రతాప్ కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని డీఎస్పీ కార్యాలయంలో సర్వమత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా అందరూ కలిసికట్టుగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధ మతాలకు చెందిన మత పెద్దలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించనున్నట్లు ఈఓ భద్రాజీ సోమవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమానికి ఆలయ సిబ్బంది హాజరు కావాలన్నారు.

బై బై.. గణేశా

అనంతపురం కల్చరల్: నగరంలో మూడు రోజుల పాటు పూజలందుకున్న గణపయ్యలు సోమవారం గంగ ఒడికి చేరారు. పలు చోట్ల అన్నదానాలు, హోమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ముఖ్యంగా ఎస్కేయూ, ఆకుతోటపల్లి వద్ద ముగింపు వేడుకలు ఘనంగా సాగాయి. నిమజ్జనం సందర్భంగా రామనగర్‌లోని అలగ్జాండర్ హోమ్స్ వద్ద సీనియర్ అడ్వకేట్ ఎల్వీ రంగారెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. అలాగే రెవెన్యూ కాలనీ, నాలుగో రోడ్డు, ఎల్బీ నగర్ తదితర చోట్ల బాణాసంచా కాల్చారు. యువత రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. రాచానపల్లి చెక్‌డ్యాం, పండమేరు వంకలో వినాయకులను జలధికి తరలించారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో వినాయక నిమజ్జన సందడి నెలకొంది. వినాయకుల విగ్రహాల వద్ద నిర్వాహకులు, భక్తులు లడ్డూ వేలం నిర్వహించారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ట్రాక్టర్, ఆటోలు, బొలెరో తదితర వాహనాల్లో వినాయకులను కొలువుదీర్చి ఊరేగించారు. వై.కొత్తపల్లి, పంపనూరు వద్ద ఉన్న హంద్రీ–నీవా కాలువలో పెద్ద పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు.

రాప్తాడు: మండలంలోని15 గ్రామ పంచాయతీల్లో గణేశ్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మూడు రోజుల పాటు బొజ్జ గణపయ్యకు విశేష పూజలు చేసిన భక్తులు.. సోమవారం మేళాతాళాలు, డప్పు వాయిద్యాలతో ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోల్లో వినాయకులను ఊరేగించారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు, పెద్దలు తారతమ్యం లేకుండా చిందులు తొక్కారు. రంగులు చల్లుకుంటూ, టపాసులు పేల్చుతూ సందడి చేశారు. రాప్తాడులో విగ్రహాలను పండమేరు వంక, చెరువులు, వంకలు, బోరుబావుల్లో నిమజ్జనం చేశారు. గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి, రాప్తాడు సీఐ టీ.వీ.శ్రీహర్ష ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలో చిన్మయనగర్, ఆడిటర్స్ కాలనీ, శివాలయం వీధి, ఇందిరమ్మ కాలనీ, పంచాయతీ రాజ్ కాలనీ, కళాకారుల కాలనీలో గణేశుడు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నాడు. మూడో రోజు సోమవారం కూడా వినాయకుడు ప్రత్యేక పూజలందుకుంటున్నాడు.



వెళ్లి రా బొజ్జ గణపయ్యా..



కాలభైరవ అలంకరణలో వినాయకుడు



హౌసింగ్ బోర్డు కాలనీలో పూజలందుకున్న గణపతి



బళ్లారి రోడ్డులో అమ్మవారి రూపంలో దర్శనమిచ్చిన వినాయకుడు



రాప్తాడులో నిమజ్జనానికి వెళ్తున్న వినాయకుడు



రెవెన్యూ కాలనీ రైల్వే ట్రాక్ సమీపంలో వినాయకుడికి పూజలు



ఆత్మకూరులో నిమజ్జనానికి తరలుతున్న గణపయ్యలు



ఎం.బండమీదపల్లిలో యువత సందడి



ఆత్మకూరులో వినాయక విగ్రహాల ఊరేగింపు



వినాయకుడి పూజల్లో పాల్గొన్న మహిళలు



నిమజ్జనానికి ముందు వినాయకుడికి పూజలు



కొడిమి వద్ద వినాయకుల నిమజ్జనం



వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



నృత్యం చేస్తున్న యువతులు

దేవాలయ భూమి అన్యాక్రాంతం

అనంతపురం అర్బన్: స్థానిక పాతూరులోని చెన్నకేశవ స్వామి దేవాలయ భూమి అన్యాక్రాంతం అయ్యిందని హిందూ చైతన్య వేదిక, విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ నాయకులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో చైతన వేదిక అధ్యక్షుడు విశ్వేశ్వర రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరెడ్డి తదితరులు కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలసి సమస్యను విన్నవించారు. దేవాలయ భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తున్నారని చెప్పారు. ఆక్రమణపై దేవదాయ శాఖ అధికారులకు తెలియజేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఉన్న కొద్దిపాటి స్థలాన్ని ఆక్రమించి ఏకంగా ప్రహరీ నిర్మించారంటే పరిస్థితి ఏమిటనేది అర్థమవుతోందన్నారు. దీనిపై లోతుగా విచారణ జరిపించి.. ఇందులో ఎవరి పాత్ర ఉందో నిర్ధారించాలన్నారు. ఆక్రమణకు సహరిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని దేవాలయ భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ రెడ్డి, శంకర్, రత్నమయ్య, విజయ్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వినోద్ కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



రాప్తాడులో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

రాప్తాడు: మహిళలు, బాలింతలు, గర్భిణులు, పిల్లలు రక్తహీనత బారిన పడకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో పౌష్టికాహార మాసోత్సవాలను పురస్కరించుకుని రక్తహీనత, ఇమ్యునైజేషన్, అనుబంధ పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సమతుల్యత ఆహారంపై అవగాహన కల్పిస్తూ పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐరన్ సాంద్రత ఎక్కువగా ఉన్న కూరగాయలు, ఆకు కూరలు, జొన్నలు, గుడ్లు, మాంసాహార పదార్థాలు, బెల్లం, ఖర్జూరం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, ముత్యాలమ్మ, ఆయా సుశీల తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. సోమవారం ప్రియాంక నగర్, రాజీవ్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. గర్భవతులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పోషక విలువలు మెండుగా ఉన్న ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు తీసుకోవాలన్నారు. చిన్నారుల బరువు పెరుగుదలకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గంగాదేవి, షాను పాల్గొన్నారు. అలాగే రామ్‌నగర్‌లో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, చిన్నారులు రుచికరమైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

తోపుదుర్తిలో వైద్యాధికారుల పర్యటన



జ్వరాలపై సర్వే చేస్తున్న మలేరియా వైద్యాధికారులు



అపరిశుభ్రత నెలకొన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తి గ్రామంలో సోమవారం వైద్యాధికారులు పర్యటించారు. రెండు రోజుల క్రితం గ్రామంలో యశ్వంత్ అనే విద్యార్థి జ్వరంతో బాధపడుతూ మరణించాడు. విషయం తెలుసుకున్న మలేరియా వైద్యాధికారులు గ్రామంలో పర్యటించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ మరియు వైద్య సిబ్బంది గ్రామంలో జ్వరాలపై సర్వే నిర్వహించారు. విద్యార్థి ఏ కారణంతో చనిపోయాడన్న విషయంపై యశ్వంత్ తల్లిదండ్రులను ఆరా తీశారు. అనంతరం గ్రామంలో ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా? అని ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య చికిత్సలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలో అపరిశుభ్రత నెలకొన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సబిహా సుల్తానా, మలేరియా వైద్య సిబ్బంది మద్దయ్య, శ్రీధర్‌మూర్తి, నూర్ బాషా, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం



లక్ష్మీదేవి కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఓ చిన్నారి వైద్యానికి ఏకంగా రూ.4 లక్షల సాయం అందించి అండగా నిలిచారు అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి. వివరాలు.. స్థానిక ఆదర్శ కాలనీలో నివసిస్తున్న లక్ష్మీదేవికి ముగ్గురు సంతానం. భర్త వీరన్న చెడు అలవాట్లకు లోనై భార్యాపిల్లలను పట్టించుకోవడం మానేశాడు. లక్ష్మీదేవి కూలీ నాలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. విధి వక్రీకరించి ఇటీవల 9 ఏళ్ల అమ్మాయి రోహిణికి పేగుల్లో ఇన్‌ఫెక్షన్ రావడం, లివర్ చెడిపోవడంతో అధిక మొత్తంలో అప్పులు చేసి వైద్యం చేయించినా నయం కాలేదు. చివరకు బెంగళూరులో చూపిస్తే వైద్యానికి రూ.4 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. దాతల కోసం ఎదురు చూసిన లక్ష్మీదేవి చివరికి అమ్మ సంస్థ రమణారెడ్డిని కలిసింది. వెంటనే స్పందించిన ఆయన తొలుత ఆపరేషన్‌కు రూ.3.50 లక్షల చెక్కు అందించారు. ఖర్చులకు మరో రూ.50 వేల నగదు అందించి మానవత్వం చాటుకున్నారు. భవిష్యత్తులో కూడా రోహిణికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మంజునాథ్ ఉదయాన్నే మూల విరాట్‌కు అభిషేకం చేశారు. పుష్పాలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని ఫల, పుష్పాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

12న ఓబుళంపల్లిలో వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఓబుళంపల్లిలో ఈనెల 12వ తేదీన పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా మొబైల్ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఓబుళంపల్లి శ్రీసత్యసాయి సేవాదళ్ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ గ్రామంలో ప్రతి నెల 10వ తేదీన వైద్య శిబిరం జరిగేదన్నారు.. అయితే ఈనెల నుంచి 12వ తేదీన మెడికల్ క్యాంపు జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ఓబుళంపల్లి చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు గమనించాలన్నారు. షుగర్, బీపీ, డెంటల్, చిన్న పిల్లలు, గర్భవతులు, ఎముకలు, థైరాయిడ్, ముక్కు, చెవి, గొంతు తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డుతో పాటు సెల్‌ఫోన్ నంబర్ తప్పనిసరిగా తీసుకుని రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఓబుళంపల్లి చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకూడదు

అనంతపురం: నగరంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ పి.జగదీష్ పోలీసులకు సూచించారు. సోమవారం నగరంలోని ప్రధాన కూడళ్లు , నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు. సాయంత్రం సప్తగిరి సర్కిల్, గాంధీ బజార్,తాడిపత్రి బస్టాండ్, తిలక్ రోడ్డు, బళ్లారి బైపాస్, కళ్యాణదుర్గం బపాస్, రుద్రంపేటలో పర్యటించారు. తొలిరోజు వినాయకుల నిమజ్జనం సందర్భంగా కొడిమి, రాచానపల్లి నిమజ్జనం పాయింట్లను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ సీఐ రఘు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరభద్ర స్వామి జయంతి

అనంతపురం కల్చరల్: నగరంలోని వీరశైవుల రుద్రభూమి ప్రాంగణంలో కొలువైన కాశీవిశ్వేశ్వరాలయంలో మంగళవారం వీరశైవుల ఆరాధ్యదైవమైన వీరభద్రస్వామి జయంతి నిర్వహిస్తున్నారు. రుద్రభూమిలో ఏర్పాటు చేసిన కాశీవిశ్వేశ్వరుడు, పార్వతీదేవి, గణపతి, సుబ్రమణ్యేశ్వర స్వామి, నందీశ్వర, రేణుకాచార్య, బసవేశ్వర స్వామి, పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాలకు వీరశైవ మతాల నుంచి విచ్చేయనున్న జంగమస్వాములు పుణ్యావాచకం, రుద్రం, చమకం, పరుషసూక్తంతో మహా సంప్రోక్షణ చేస్తారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ పూజలు కొనసాగుతాయి. ఇదే సందర్భంలో వీరభద్రస్వామి జయంతి వేడుకలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలందిస్తారు.

ఇద్దరు వ్యక్తులపై రాళ్లతో దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లోనికోటకు చెందిన వరప్రసాద్, అతని బావ శ్రీనివాసులుపై రిలయన్స్ ట్రెండ్స్ వద్ద సోమవారం రాత్రి అదే కాలనీకి చెందిన అఖిల్, ఆటో మణి, వారి స్నేహితులు రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. ఇంటికి వెళ్లిన వరప్రసాద్, శ్రీనివాసులు వారి స్నేహితులు కలిసి అఖిల్‌ను కొట్టాలని అతడి ఇంటికి వెళ్లారు. అయితే అక్కడ అఖిల్ లేకపోవడంతో అతని తల్లి ఉమాదేవిపై దాడి చేశారు. వినాయక విగ్రహం వద్ద జరిగిన చిన్నపాటి వాగ్వాదమే ఈ దాడికి కారణమని పోలీసులు తెలిపారు.

రిలయన్స్ ఉద్యోగి దుర్మరణం

- మూడు రోజుల క్రితం ప్రమాదం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



మల్లికార్జున (ఫైల్)

ధర్మవరం రూరల్: వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో రిలయన్స్ డిజిటల్‌లో పనిచేస్తున్న ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన మల్లికార్జున (34)కు భార్య శ్వేత, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనంతపురంలోని రిలయన్స్ డిజిటల్‌లో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 5న పనిపై ధర్మవరానికి వచ్చిన ఆయన ద్విచక్ర వాహనంపై అదే రోజు తిరుగు ప్రయాణమయ్యాడు. ధర్మవరం మండలం గొళ్లపల్లి సమీపంలో మలుపు వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కన ఉన్న పల్లంలోకి వాహనం బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, మూడు రోజుల పాటు ఈ విషయం వెలుగు చూడలేదు. మృతదేహం కుళ్లి దుర్వాసన వెదజల్లుతుండడంతో సోమవారం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ నరేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి మల్లికార్జునగా నిర్ధారించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.